క్లుప్తంగా

విద్యార్థులకు కిట్లు పంపిణీ



కర్లపాలెం: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వినియోగించుకుని విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. కర్లపాలెం పంచాయతీ కొత్త ఇస్లాంపేటలోని ఉర్దూ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయశ్రీ, హెచ్ఎం షేక్ రహ్మతుల్లా, టీడీపీ నాయకులు ఎస్కే బాజీ అహ్మద్ హుస్సేన్, ఉపాధ్యాయులు ఆశాపర్వీన్, పర్వీన్ సుల్తానా, ఆసోది శివనాగమణి పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

రేపల్లె రూరల్: ప్రభుత్వం పంపిణీ చేసే పింఛన్లను జూలై ఒకటో తేదీన ఇంటి వద్దే అందజేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉదయం 6.00 గంటల నుంచి పంపిణీ ప్రారంభించనున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత మేరకు ఒకటో తేదీనే పంపిణీని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనివార్య కారణాలతో ఎవరన్నా మిగిలిపోయి ఉంటే రెండో రోజు పంపిణీ కొనసాగుతోందని వివరించారు.

భట్టిప్రోలు: పింఛన్లను జూలై ఒకటో తేదీ నుంచి ఇంటి వద్దే అందజేయనున్నట్లు ఎంపీడీఓ జీబీవీ మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని లబ్ధిదారుల మొత్తం 8,641 మందికి పెంచిన మొత్తం రూ.5,82,48,500 అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

గుంటూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ శనివారం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుంచి తేదీ మార్చి 31, 2024 వరకు నిర్వహించిన పనులు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో సామాజిక తనిఖీని చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆనంద నిలయాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు



కేబీపాలెం(కాకుమాను): ఆనంద నిలయాలు అంగన్‌వాడీ కేంద్రాలని తల్లిదండ్రులు తమ చిన్నారులను కేంద్రాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఐసీడీఎస్ పాంగ్రపాడు సెక్టార్ సూపర్ వైజర్ పి.వెంకాయమ్మ అన్నారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేబీపాలెంలో పాంగ్రపాడు సెక్టార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు ప్రతి రోజు మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచే చిన్నారులకు ఇంగ్లిష్ నేర్పించడం జరుగుతుందని తల్లిదండ్రులు తమ ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఆమె కోరారు.

పీజీఈ సెట్ ఫలితాల్లో 'హిందూ ఫార్మసీ' విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన పీజీఈ సెట్–2024 ఫలితాల్లో అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి, మెరుగైన ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతూ పీజీఈ సెట్‌కు హాజరైన 52 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వారిలో 13 మంది వెయ్యిలోపు ర్యాంకులు సాధించారని వివరించారు. గౌహతిలోని నైపర్ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తమ కళాశాల విద్యార్థిని టి.ఉమామహేశ్వరి అర్హత సాధించిందని, సంబంధిత విద్యార్థులందరికీ వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫార్మసీలో ప్రవేశంతో పాటు ఉపకార వేతనం పొందేందుకు అర్హత లభించినట్లు తెలిపారు. కళాశాల చైర్మన్ జూపూడరంగరాజు, కరస్పాండెంట్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ ఎ.ప్రత్యూష, ఓఎస్డీ పి.సీతారామయ్య, పీజీఈ సెట్ కోచింగ్ ఇన్‌చార్జ్ ప్రసాదరావు అభినందించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

లక్ష్మీపురం: స్థానిక హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలో వేంచేసి ఉన్న హజ్రత్ సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి దర్గాలో శుక్రవారం చంద్రమాన 21వ రోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి నెలా చంద్రమాన 21వ రోజు హజ్రత్ మహబూబ్ సుభాని 17వ మనువలు సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు భక్తుల సమక్షంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని దర్గా పీఠాధిపతి, బాబా 23వ మనువలు పీర్ సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ తెలిపారు.

ప్రబలుతున్న డయేరియా

- రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- ఒకే రోజు మూడు కేసులు



డయేరియాతో చికిత్స పొందుతున్న బాధితులు

పొన్నూరు: ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డయేరియా వణికిస్తోంది. ఇప్పటికే అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయి. పల్లెలతో పాటు పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, శుద్ధ జలం సరఫరా సక్రమంగా లేకపోవడం, నీటి ట్యాంకులు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో రోగాలు ప్రబలుతున్నాయి.

మండలంలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన నిడుబ్రోలు సామాజిక ఆరోగ్యకేంద్రానికి రోజూ 150 నుంచి 200 మంది వరకు రోగులు వస్తున్నారు. ఇందులో కొందరు డయేరియా, జ్వరాలతో పాటు వివిధ రకాల జబ్బులతో ఆస్పత్రికి వస్తున్నారు. ఒక్క ప్రభుత్వాస్పత్రికే అధిక సంఖ్యలో వాంతులు, విరేచనాలతో అతిసారం సోకిన బాధితులు వస్తుండగా ప్రైవేటు ఆస్పత్రుల్లో పరిస్థితి చెప్పనక్కర లేదు. అతిసారం ఓ వైపు ప్రబలుతుండగా మరో వైపు జ్వరాలు పెరుగుతున్నాయి.

పలు ప్రాంతాల్లో డయేరియా కేసులు

పొన్నూరు మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి డయేరియా కేసులు నమోదు అవుతున్నాయి. నిడుబ్రోలు ప్రాథమిక కేంద్రంలో ఇంటూరు గ్రామానికి చెందిన ముగ్గురు డయేరియాతో గురువారం నుంచి చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది సకాలంలో మెరుగైన సేవలందించి డయేరియాను అదుపులోకి తీసుకొచ్చారు. తాగునీరు కలుషితం కావడంతోనే డయేరియా సమస్య వచ్చినట్లు తెలుస్తోంది.

తగిన జాగ్రత్తలు పాటించాలి



డయేరియా కేసులు వస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు కలుషితమై జ్వరాలు వ్యాపించే అవకాశం ఉంది. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మనం తీసుకునే ఆహారం సాధ్యమైనంత వరకు వేడిగా ఉండేలా చూసుకోవాలి. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి. ఆరోగ్యం కేంద్రంలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

– డాక్టర్ షేక్ రేష్మా,
సామాజిక ఆరోగ్య కేంద్రం, నిడుబ్రోలు

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

రేపల్లె రూరల్: అతిసారం వ్యాధిపై అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. డయేరియాపై అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం వివిధశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి అధికారి తమ పరిధిలోని గ్రామాలలో ఇంటింటా పర్యటిస్తూ డయేరియాపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. ప్రతి ఒక్కరూ గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు విధిగా కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలన్నారు. చేతులు పరిశుభ్రం ఉంచుకునే విధంగా విధిగా ఆరోగ్య సూత్రాలు పాటించేలా అధికారులు తమ ఇంటింటి పర్యటనలో ప్రజలకు వివరించాలని చెప్పారు. ఐదు సంవత్సరాల వయస్సులోపు పిల్లలు ఉన్న గృహాలలో ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్లు అందించాలని చెప్పారు. ప్రజలు తమ గృహాలలో ఎటువంటి అనారోగ్య చాయలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలని చెప్పారు. రక్షిత తాగునీటిని మాత్రమే పంపిణీ చేయాని పేర్కొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది అవసరమైన ప్రదేశాలలో బ్లీచింగ్, సున్నంలను చల్లాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే విజయం మీ సొంతం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శైలజ

కాకుమాను: ప్రతి విద్యార్థి కష్టపడడంతో పాటు ఇష్టపడి చదివితే విద్యలో రాణిస్తారని జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక మేరకు చదువు కొనసాగించాలని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మూడు గంటల పాటు ఇంటి వద్ద పాఠ్యపుస్తకాలను చదవాలని సూచించారు. ప్రతి రోజు చేయడం వలన పది పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించవచ్చునని వివరించారు. మీకు కష్టమైన సబ్జెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి రోజు ఆ సబ్జెక్టును ఇంటి వద్ద చదువుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారా, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం అమలు తీరు ,తాగునీరు వంటి అంశాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన..

అనంతరం స్థానిక బీసీ కాలనీలో డీఈఓ పర్యటించారు. నేను బడికి పోతా కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలందరూ తప్పని సరిగా బడిలోనే ఉండాలని, బడి ఈడు పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం నేరమని హెచ్చరించారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత యూనిఫాం , మధ్యాహ్న భోజన పథకం, ఏటా ప్రతి విద్యార్థికి నగదు అందిస్తుందని వివరించారు. బడి ఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు కేఎఫ్ కెనడీ, కె.విజయ్ భాస్కర్, హెచ్ఎం బి.సత్యం పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు సేవలు మరువలేనివి



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సాంబశివుడు

తెనాలిఅర్బన్: పీవీ నరసింహారావు భారతదేశానికి అందించిన సేవలు మరవరానివని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు కొనియాడారు. భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు జయంతిని బోసురోడ్డులోని ఆయన విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ భారత ప్రధానిగా అనేక సంస్కరణలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలుగువారి కీర్తిని దేశం అంతటా వ్యాపింప చేశారని తెలిపారు. ఆయనకు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ, నాయకులు భీమ రమేష్, పి.శివకుమార్, పి.శివన్నారాయణ, వై.శంకరరావు, కె.వీరాస్వామి, ఎన్.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో మురుగు చేరనివ్వకండి

కమిషనర్ శేషన్న ఆదేశం



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని మురుగు కాల్వల పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అలాగే తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. రోడ్లపై ఉన్న నీరు కాల్వలోకి వెళ్లే విధంగా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దావులూరి శ్రీనివాసరావు, అనుపమ, రామచంద్రరావు, డీఈ నాగభూషణం, ఆర్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

కొనసాగుతున్న శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం , సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం కొనసాగుతోంది. 16వ రోజైన శుక్రవారం పూర్వభద్ర నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు జరిపించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) అనుగ్రహ భాషణ చేశారు. సాయంత్రం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జీవిత చరిత్రను మూడోరోజు భక్తులకు వివరించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, పెనుగొండ వెంకటేశ్వరరావు, రావూరు సుబ్బారావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరరావు, చుండూరు లోకనాధం, రాజేశ్వరరావు, రాంబాబు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పును వ్యతిరేకిద్దాం

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: బిహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సామాజిక రిజర్వేషన్లు 50 శాతానికి మించటం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమంటూ, పాట్నా హైకోర్టు రద్దు చేయడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముమ్మాటికీ ఇది బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకమైన తీర్పుగా ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయస్థానాల తీర్పుల్లో కూడా పేదలు- బడుగుల పట్ల వివక్షత ఉంటుందనడానికి, పాట్నా హైకోర్టు తీర్పు ఒక నిదర్శనంగా ఉంటుందన్నారు. ఏ కమిషన్ సిఫార్సులు, ఎట్టి గణాంకాలు ప్రాతిపదికలుగా చెప్పకుండానే, రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం, 10 శాతం కూడా లేని అగ్రకుల పేదలకంటూ తెచ్చిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు మాత్రం అనుకూల తీర్పులు ఇవ్వడం, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సివస్తే మాత్రం, అడ్డు పుల్లలు వేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు మొత్తం రిజర్వేషన్లు 60 శాతం సీలింగ్ దాటినప్పుడు లేని అభ్యంతరం, బిహార్లో శాస్త్రీయంగా జనగణనలో సమగ్ర కులగణన నిర్వహించి, ఆ కులగణనల ఆధారంగా పెరిగిన జనాభా మేరకు, రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం పెంచితే మాత్రం పెంపు చెల్లదంటూ, పాట్నా హైకోర్టు తీర్పునివ్వడం అన్యాయం- అధర్మమంటూ శంకరరావు వాపోయారు. ఈ లెక్కన చూస్తుంటే కులాల వారీగా, ఎవరి జనాభా దామాషా మేరకు వారికి సమస్త రంగాలలో రిజర్వేషన్లు దక్కడం న్యాయవ్యవస్థకు ఇష్టం లేనట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై త్వరలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అట్టడుగు వర్గాలకు ముఖ్యంగా బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ల సాధన కోసం గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వడపాలెం గ్రామానికి చెందిన సూరాడ దేవుడు (56) తన కుటుంబసభ్యులు, బంధువులతో కలసి తిరుపతి వెళ్లేందుకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో గురువారం బయలుదేరాడు. తెనాలి రైల్వేస్టేషన్ మూడో నంబరు ప్లాట్‌ఫాం వద్దకు రాగా ప్రమాదవశాత్తు రైలుకు, పట్టాల మధ్యలో పడి మృతి చెందాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అదే రైలులో తిరుపతి వెళ్లిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రి లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, భరణాల కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ప్రజలందరూ న్యాయశాఖ ఇచ్చిన లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు.

హేన దీప్తికి అభినందనలు

నెహ్రూనగర్: అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీ రైజింగ్ స్టార్‌గా గుంటూరు నగరానికి చెందిన కొండా హేన దీప్తి అర్హత సాధించడం అభినందనీయమని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి లాడ్జి సెంటర్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనడాలో పనిచేస్తున్న హేన దీప్తి అమెజాన్ కంపెనీలో 6వ లెవల్‌లో పనిచేస్తూనే యాపిల్, గూగుల్, ఆర్‌టీఎక్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.


బయాలజీ విభాగానికి ఎన్ఏబీఎల్ గుర్తింపు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రో బయాలజీ విభాగానికి ఎన్ఏబీఎల్(నేషనల్) గుర్తింపు మరోసారి రావడంపై గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో మైక్రో బయాలజీ వైద్యులను ఆయన అభినందించారు. ఎన్నో సంవత్సరాల విశేష కృషి వల్ల ఎన్ఏబీఎల్ మరోసారి మైక్రో బయాలజీకి వచ్చిందని, ఇది అందరి సమష్టి కృషితో సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ ఇజ్రాయేల్, పవన్ కుమార్, నాగేశ్వరావు, ముస్తఫా పాల్గొన్నారు.

ఝాన్సీ రాణికి డాక్టరేట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకురాలు జె.సరళ ఝాన్సీరాణికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి శుక్రవారం తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధన పరిశీలకురాలు డాక్టర్ టి.రమాదేవి పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ ప్రాబ్లమ్స్ ఇన్ మార్కెటింగ్ ఆఫ్ కాటన్ అండ్ ది రోల్ ఆఫ్ డిఫరెంట్ మార్కెటింగ్ ఏజెన్సీస్ - ఎస్పెషల్ రిఫరెంట్ టు వరంగల్, ఆదిలాబాద్ అండ్ మహబూబ్ నగర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది.

శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం



నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ కార్యక్రమాల్లో భాగంగా తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి భాగవత గోష్ఠి బృందం ఈ కార్యక్రమం చేపట్టింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, బొల్లేపల్లి లలితాంబ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీ రంగనాయకి ప్రసంగిస్తూ అమ్మవారిని స్తుతించడం ద్వారా భగవాన్ శంకరాచార్యుల వారికి విముక్తి కల్పించినట్లు తెలిపారు. అమరావతి ఆర్థిక సమస్యల నుంచి విముక్తికి ఈ పారాయణ సంకల్పానికి పూనుకున్నట్లు చెప్పారు. ఒక ప్రాణికి మేలు చేస్తే ఆ స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులవుతామని పేర్కొన్నారు. భాగవత గోష్ఠి బృందం కనకధారా, శ్రీలక్ష్మ్యష్టోత్తర శతనామ స్తోత్రసహిత శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం 108 సార్లు పారాయణం చేశారు.

పైప్‌లైన్లకు లీకులు.. తాగునీరు కలుషితం



నిడుబ్రోలు పార్కు వద్ద లీకవుతున్న పైప్‌లైను



5వ వార్డులో మురుగు కాలువలో పైప్‌లైను

పొన్నూరు: పట్టణంలో తాగునీరు కలుషితం అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ట్యాంకుల శుభ్రత, పైప్‌లైన్ల మరమ్మతులను గాలికొదిలేశారు. చాలాచోట్ల పైపులు లీకై మురుగు నీటితో కలిసి కుళాయిల్లో సరఫరా అవుతుండటంతో ఫలితంగా తాగునీరు కలుషితమై జనం డయేరియా బారిన పడుతున్నారు. డయేరియా కేసులు పెరుగుతున్నా అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు విఫలమవుతున్నారు.

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన అశోక్‌కుమార్

తెనాలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొల్లిపర మండలం పాత బొమ్మువానిపాలెంలో ఆదివారం ఆవిష్కరించనున్నారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికను శుక్రవారం సాయంత్రం స్థానిక రామలింగేశ్వరపేటలో ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంగ్రపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ, సభకు అంబేడ్కర్ మనుమడు, సమతా సైనిక్‌దళ్, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంతరావ్ అంబేడ్కర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు దావులూరు అడ్డరోడ్డు నుంచి విగ్రహావిష్కరణ సభా ప్రాంగణం వరకూ భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ప్రముఖ చరిత్రకారుడు బొనిగల రామారావు, దళిత స్త్రీ సాహిత్య పరిషత్ కన్వీనర్ బీఎం లీలాకుమారి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, హైకోర్టు న్యాయవాది చందోలు శోభారాణి తదితర ప్రముఖులు, గ్రామ సర్పంచ్ కొల్లి రజని మాజీ సర్పంచ్ బొమ్ము శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలియజేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి మేధావులు, బుద్ధిస్టులు, అంబేడ్కర్ వాదులు పాల్గొంటున్న సభను జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు. నాగార్జున కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కారుమంచి రవికుమార్ మాట్లాడుతూ భావితరాలకు అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తిని తెలియజేసేందుకు నిర్వహించే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు కనపర్తి బెన్హర్, చుండూరు దళిత బాధితుల పోరాట కమిటీ జాలాది మోజెస్ మాట్లాడారు. డాక్టర్ అంబేడ్కర్ యువజన సమైఖ్య, విగ్రహ నిర్వహణ కమిటీ, శ్రీకృష్ణ కో–ఆపరేటివ్ సొసైటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జరిగే విగ్రహావిష్కరణ గోడపత్రికను ముందుగా ఆవిష్కరించారు. వీరితో పిల్లి జయపాల్, తూమాటి అంబేడ్కర్, దాసరి చినవంటిబాబు, పిల్లి నరసింహారావు ఉన్నారు.

దివ్యాంగుల్లో అమోఘమైన మేధా సంపత్తి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: దివ్యాంగుల్లో అమోఘమైన మేధా సంపత్తి దాగి ఉంటుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దివ్యాంగుల్లో జీవితంలో ఏదైనా సాధించాలనే తపన గాఢంగా ఉంటుందని, వారి ఆలోచనలకు పదును పెట్టి ఎన్నో అద్భుతాలు సాధిస్తున్నారన్నారు. వారిలో ఉన్న పట్టుదల, శ్రద్ధ, అంకిత భావం ఎంతో గొప్పవన్నారు.

ఏపీ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ ఇన్‌చార్జి జూపూడి యజ్ఞదత్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఆశయంతో సమర్థనం సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యా వంతులైన దివ్యాంగ నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. సమర్థనం సంస్థ ప్రతినిధి ఎంఆర్కే పరమహంస మాట్లాడుతూ 35 బహుళ జాతి సంస్థలు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు హాజరైన 600 మంది నిరుద్యోగ యువతలో 150 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం, ఫార్మా డీ డైరెక్టర్ పి.సీతారామయ్య, సమర్థనం దివ్యాంగుల సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.